అండర్ పాస్.. అష్టకష్టాలు

వంతెన పనులు పూర్తి కాక పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్లైనా బ్రిడ్జి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారి.. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాకాలం సమీపిస్తుందని, ప్రత్యామ్నాయ మార్గం చూపాలని, లేదంటే ఆరు కిలోమీటర్ల ప్రయాణం కాస్త.. 30కి.మీ.కు పెరుగుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- వంతెన పూర్తికాక.. రోడ్డు బంద్
- రెండేళ్లయినా పురోగతిలేని రైల్వే బ్రిడ్జి నిర్మాణం
- ఆగిన మురుగు కాలువ పనులు
- 30కిలో మీటర్లకు పెరిగిన దూరభారం


మధ్యలో ఆగిన మురుగు కాలువ పనులు


మొరంగపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు నిలిచిపోవడంతో రాకపోకలు బంద్

మోమిన్‌పేట: మండల పరిధిలోని కోటపల్లి వెళ్లే రహదారిలో మొరంగపల్లి వద్ద రైల్వేగేటు రైల్వే అండర్ పాసు బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం చేపట్టారు. దీంతో కేసారం, సయ్యద్ అల్లీపూర్, ఇజ్రాచిట్టంపల్లి, పల్లేగుట్టతండాతో పాటు మర్పల్లి మండలం తిమ్మాపూర్, రావులపల్లి, కోటపల్లి మండలం బార్వాద్ గ్రామాల ప్రజలు నిత్యం ఇదే రహదారిపై మోమిన్‌పేటకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ గడిచిన రెండేళ్ల వర్షా కాలంలో అటుగా కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని బాధిత గ్రామాల ప్రజలు చెప్పారు. దీంతో మర్పల్లి మీదుగా 30 కిలో మీటర్లు తిరిగి వెళ్లామని చెబుతున్నారు. ఏడాది క్రితం రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్న సంబంధిత అధికారులు.. ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి చేయలేకపోయారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టితీత పనులు పూర్తైనా.. సీసీ పనులు కొంత మేరకు చేసి ఆపేశారు. దీంతో పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

వానొస్తే బంద్..

మురుగు నీరు వెళ్లేందుకు నిర్మించాల్సిన కాలువ పనులు.. సగంలో ఆపేశారని, వెసవిలో కాలువ నిర్మించి ఉంటే రాక పోకలకు ఇబ్బందులు ఉండేవి కావని గ్రామస్తులు చెబుతున్నారు. మరో రెండు మాసాల్లో వర్షాకాలం రానుందని, అప్పటి లోగా కాలువ పనులు పూర్తి చేయకపోతే.. అండర్ పాసు రోడ్డులో వర్షపు నీరు నిండుతుందని వారు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ రాకపోకలు నిలిపివేశారని, వేసవిలో పనులు పూర్తి కాని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గం చూపాలని స్థానికులు కొరుతున్నారు.

ఎంపీ హామీ ఇచ్చినా..

ఐదు నెలల క్రితం చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఆయా గ్రామాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడారు. అవసరమైతే అదనంగా రూ.50లక్షలు ఇస్తామని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. దీంతో నాడు రెన్నెళ్లలో పూర్తి చేస్తామన్న అధికారులు.. ఐదు నెలలు గడుస్తున్నా.. పనుల్లో పురోగతి చూపలేకపోయారు.

30 కిలో మీటర్లు పెరుగుతుంది



ఏడాది క్రితం రెండు నెలల్లో అండర్ పాస్ వంతెన పనులు పూర్తి చేసి రాకపోకలకు ఆటంకం లేకుండా చేస్తామన్నారు. కానీ ఇప్పటికీ సగం పనులు కూడా పూర్తి చేయలేదు. వర్షా కాలంలో గ్రామానికి రాకపోకలు ఎలా సాగించాలో అర్థం కావడం లేదు. ప్రత్యామ్నాయ మార్గం చూపకపోతే.. ఆరు కిలో మీటర్ల ప్రయాణం కాస్త 30కిలో మీటర్లకు పెరుగుతుంది.

– కాశీరాం, సర్పంచ్, ఇజ్రాచిట్టంపల్లి

లక్ష్యంతో చదివి.. ఉన్నత స్థితికి ఎదగాలి

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలి
- పదో తరగతి.. పై చదువులకు తొలిమెట్టు : వక్తలు

మర్పల్లి: లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. 10వ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతుందని, ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఏకాగ్రతతో చదువుకొని ప్రతి ఒక్కరు అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మర్పల్లి: విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్

విద్యార్థులకు ఎస్‌ఐ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు సెల్‌ఫోన్ ఇతర వ్యాపకాలపై దూరంగా ఉంటూ.. చదువుపై శ్రద్ధ చూపాలని చెప్పారు. విద్యార్థులకు పది పరీక్షలు ఎంతో కీలకమైనవని, ఉన్నత చదువులకు తొలిమెట్టు అని తెలిపారు. ఎవరికైనా ఇబ్బంది తలెత్తుతే 100కు డయల్ చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం మారుతినారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్లూర్‌లో..

పట్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సరఫరా చేసిన ఎగ్జామ్ ప్యాడ్స్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాలయ్య, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

ఒత్తిడికి లోనుకావొద్దు

కొడంగల్ రూరల్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉన్నత మార్కులు సాధించాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉత్తమ ఫలితాలపై దృష్టి సారించాలి

దోమ: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలపై దృష్టి పెట్టాలని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని, ఈ మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, మండల రైతు సమన్వయ సమితీ అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, పాఠశాల చైర్మన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి యువతే వెన్నెముక


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్‌ఓ

సాంకేతిక రంగంలో దూసుకుపోవాలి
- డీఆర్‌ఓ అశోక్‌కుమార్

అనంతగిరి: దేశానికి యువతే వెన్నెముక అని డీఆర్‌ఓ అశోక్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి నైబర్‌హుడ్ పార్లమెంట్‌ను డీఆర్‌ఓ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు భారతదేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని, భవిష్యత్ అంతా యువతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా దూసుకుపోవాలని, యువత కోసం ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొంటూ.. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మన యువత ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ముందుంటుందని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో రాణించేందుకు ఉన్న అవకాశాలు, వనరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీఓ దశరథ్, అగ్రికల్చర్ ఏడీ స్వరూపారాణి, జిల్లా యువజన అధికారి ఈసయ్య, సైంటిస్టు సేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నత్తే నయం!

- ముందుకు సాగని సమీకృత మార్కెట్ పనులు
- సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వానాకాలం నాటికి వినియోగంలోకి తీసుకురావాలంటున్న వ్యాపారులు


పునాది స్థాయిలో ఆగిన మార్కెట్ పనులు

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనకకు అన్న చందంగా సాగుతున్నాయి. పనులు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. నాలుగేళ్ల క్రితం మంజూరైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్.. మూడేళ్ల పాటు టెండర్లకు కూడా నోచుకోలేదు. ఏడాది క్రితం టెండర్లు పిలిచి.. సదరు నిర్మాణదారుడికి పనులు అప్పగించినా.. ఏడాది పాటు పనులు మొదలు పెట్టలేదు.

మార్కెట్ పూర్తవుతుందా?

మున్సిపల్ అధికారుల చొరవతో ఎట్టకేలకు గత డిసెంబర్‌లో మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి సరిగ్గా ఇరవై రోజుల పాటు పనులు ముమ్మరంగా సాగాయి. ఆ తరువాత ఎందుకో పనులు నెమ్మదించాయి. పునాదులు తీసి, సిమెంట్ బెడ్ వేసి వదిలేశారు. ఈ పనులు చేసి దాదాపు రెండు నెలలు అయినట్టు స్థానికులు చెబుతున్నారు. పనులు పూర్తిగా నిలిపివేసినట్లు కాకుండా, కొద్దికొద్దిగా చేస్తుండటంతో అసలు మార్కెట్ పూర్తవుతుందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో తీవ్రజాప్యం

సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రజా ప్రతినిధుల నుంచి కొంత ఒత్తిడి ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నా.. పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. ఆరు నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉండగా.. మూడు నెలలు గడిచిపోయింది. మరో రెండు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. దీంతో నిర్మాణ పనులకు మరింత ఆటంకం కలగనుందని వ్యాపారులు అంటున్నారు. ఇప్పటికైనా పనులు వేగిరం చేసి, వానాకాలం నాటికి మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పే స్కేలు అమలు చేయాలి

అనంతగిరి: పే స్కేలు అమలు చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శనివారం బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖకు అనుబంధంగా 21వేల మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు రూ.10లక్షలు, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20లక్షలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవినాయక్, అనిత, కృష్ణయ్య, రాగిణి, జ్యోతి, మీనాక్షి, అంజయ్య, మమత, రమాదేవి, దశరథ్, కమాల్, వెంకటయ్య, నర్సింహులు, శేఖర్, వెంకట్‌రెడ్డి, మోహన్ రాజు, గౌస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


శుభప్రద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రవికుమార్

తాండూరు: తాండూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2023–24 సంవత్సరానికి గాను అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి మఠం చంద్రశేఖర్‌కు అవకాశం దక్కింది. ప్రధాన కార్యదర్శిగా పాశం రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా న్యాయవాది రజిత, ట్రెజరర్‌గా విశ్వనాథ్, మహిళా విభాగం నుంచి న్యాయవాది అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి భవనప్ప తెలిపారు. నూతన కార్యవర్గం ఏర్పాటుపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

ఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలి

కుల్కచర్ల: ప్రమాదం జరిగిన స్థలానికి త్వరితగతిన చేరుకొని క్షతగాత్రులకు వైద్యసేవలందించాలని ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విఘ్నేశ్వర్ అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో 108 వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఫోన్లు వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని, వైద్య సేవలు అందించాలని చెప్పారు. మెరుగైన వైద్య సేవల కోసం అవసరం ఉన్న ఆసుపత్రులకు బాధితులను తీసుకెళ్లాలని సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న విఘ్నేశ్వర్

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సర్వే

యాలాల: మండల పరిధిలోని అగ్గనూరులో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు విద్య, ఉపాధి అంశాలపై శనివారం సర్వే చేశారు. సింధు డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు.. అధికారిక విద్య, ఉపాధిపై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. ఉపాధి విషయంలో వారి సలహాలు, సూచనలు విన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయాదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథం గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

పెద్దేముల్: ఈ నెల 28న(మంగళవారం) పెద్దేముల్ మండలం తట్టెపల్లి వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని సీఈఓ రాజమౌళి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం జరుగుతుందని, సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మోమిన్‌పేట: విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ అన్నారు. శనివారం చంద్రాయన్‌పల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ఎంపీ రంజిత్‌రెడ్డి సౌజన్యంతో పరీక్ష ప్యాడ్లను ఆయన ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు అంజయ్య, సత్యనారాయణరెడ్డి, కాశీరాం, నాయకులు భిక్షపతి, నర్సింహులు, సందీప్, రాజు, మల్లేశం, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయురాళ్లు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్ పక్వాడ్'

చేవెళ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, మహిళలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజలకు అందించే పౌష్టికాహారం, చిరుధ్యానాలను ప్రదర్శించారు. పోషక లోపాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకుపోవాలని చెప్పారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

ఆదరణ చూసి ఓర్వలేని బీజేపీ


పూడూరు: ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్రం

- రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు మోదీ కుట్రే
- నిరసన కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ నేతల మండిపాటు

పూడూరు: ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ తలపెట్టిన భారత్‌జోడో యాత్రకు దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ ప్రభుత్వం ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు.

కక్షసాధింపు చర్యలు..

అనంతగిరి: రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ వికారాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు పాల్పడుతోందని, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నందుకే రాహుల్‌ను ఇబ్బంది పెడుతుందన్నారు.

బీజేపీది నిరంకుశ పాలన

ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్


జోడో కార్యక్రమంలో రమేష్ మహరాజ్

తాండూరు: రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడం నిరంకుశ పాలనకు అద్దం పడుతోందని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ.. పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేసిందని ఆరోపించారు. బీజేపీ వ్యవహరిస్తున్న దుందుడుకు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల రాహుల్ తలపెట్టిన జోడో యాత్ర విజయవంతం అయిందని, దీంతో ఆయన్ను రాజకీయంగా నియంత్రించేందుకు ఇలాంటి కుయుక్తులకు పాల్పడిందన్నారు. ఈ రోజు దేశంలో స్వతంత్రంగా జీవించడానికి గాంధీ కుటుంబమే కారణమని, అలాంటి కుటుంబాన్ని ఇబ్బందులు కలిగించేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాహుల్‌పై బీజేపీ తీసుకున్న నిర్ణయంతో ప్రజలే తిరగబడుతున్నారని, 2024లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కౌన్సిలర్ మధుబాల, మమత, నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.10 లక్షలతో సీసీరోడ్డు


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

యాలాల: గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ సత్యమ్మ, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం రూ.10లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి వీధిలో సీసీ, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శరణప్ప, గ్రామస్తులు అశోక్, రఘునాథ్‌రెడ్డి, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సప్తమ వార్షికోత్సవం


గీతాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

నవాబుపేట: పులుమామిడిలో శివ పరివారం రుక్మిణీ విఠలేశ్వర, సుబ్రహ్మణ్య, నవగ్రహ, సీతారామాంజనేయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు రెండో రోజు ఘనంగా జరిగాయి. శనివారం స్వామి వారికి అలంకరణ, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం సామూహిక ఈతయజ్ఞం, మహాప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం(నేడు) గణపతిపూజ, మధ్యాహ్నం సీతారామ కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విమల రంగారెడ్డి, ఎంపీటీసీ తేజశ్విని, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ


పార్కు ప్రహరీ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: మున్సిపాల్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడు అభివృద్ధిపై ఆరా తీస్తున్నారని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల చెప్పారు. శనివారం 6వ వార్డు పోలీసు కాలనీలో రూ.5లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణ పనులు ఆమె ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, స్థానిక కౌన్సిలర్ చందర్ నాయక్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వం

పరిగి: ప్రత్యేక రాష్ట్రం కోసం 1200 మంది విద్యార్థులు బలిదానం చేసుకుంటే తెలంగాణ వచ్చిందని, కాని నేడు కల్వకుంట్ల కుటుంబం మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తూ.. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని పలు సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం పట్టణ కేంద్రంలో యూత్ కాంగ్రెస్, గిరిజన విద్యార్థి సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, బీఎంఎం, బీవీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమం చేస్తే.. నేడు అవేవీ కనిపించలేదని, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలనపై ప్రశ్నించే గొంతుకలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నొక్కిపడుతుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు ప్రజా సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్, గోవింద్, నాగవర్ధన్, అనిల్, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

రూ.19 లక్షలకు తైబజార్ వేలం

పరిగి: పరిగి తైబజార్ బహిరంగ వేలం పాట శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. వేలంలో 7 మంది పాల్గొనగా.. ముఖిద్ అనే వ్యక్తి రూ.19 లక్షల 3 వేలకు గాను 2023–24 సంవత్సరానికి పాటలో దక్కించుకున్నారు. స్లాటర్ హౌస్ వేలానికి ఎటువంటి దరఖాస్తులు రానందున, మరలా వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని, తైబజార్ వేలం పాటలో ఎవరైనా పాల్గొనవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తెలిపారు. కౌన్సిలర్లు కిరణ్, రవీందర్, మునీర్, నాగేశ్వర్, ఎదిరే కృష్ణ, మౌలానా పాల్గొన్నారు.